సాక్షి
కాకినాడ
ఆదివారం । 2 । జూలై । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,130, మధ్య డెల్టాకు 1,530, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



పరీక్ష ఫెయిలైన వారికి వరం

పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు తిరిగి రెగ్యులర్‌గా చదువుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0°/26.9°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.0	27.0
కాకినాడ	38.7	27.0
అమలాపురం	38.5	28.0

న్యూస్‌రీల్

4న న్యాక్‌లో జాబ్ మేళా

సామర్లకోట: స్థానిక సీబీఎం సెంటర్‌లో ఉన్న న్యాక్ శిక్షణ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా జాబ్స్ మేనేజరు కేశవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జి.రాగంపేటలో ఉన్న బ్లూ ఓషన్ సంస్థలో ట్రైనీ కెమిస్టు, ప్రొడక్షన్ ఆపరేటర్, ట్రైనీ పోస్టులకు బీఎస్సీ, ఇంటర్, ఐటీఐ అర్హత ఉండాలన్నారు. అలాగే క్యూస్ గ్రూప్ లిమిటెడ్‌లో బ్రాంచి రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్, బ్రాంచి రిలేషన్ షిప్ మేనేజరు పోస్టులకు ఇంటర్ నుంచి డిగ్రీ అర్హత ఉండాలన్నారు. ఎంపికైన వారు కాకినాడ, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, అనకాపల్లిలలో పని చేయాల్సి ఉంటుందన్నారు, అభ్యర్థులు ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులతో హాజరుకావాలన్నారు.

రత్నగిరిపై ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం వాయిదా

అన్నవరం: రత్నగిరి దేవస్థానంలో శనివారం నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌లో మంచినీటి విక్రయాలను నిలిపివేయాలన్న నిర్ణయాన్ని దేవస్థానం అధికారులు వాయిదా వేశారు. దేవస్థానంలో ఆరు కీలక ప్రదేశాల్లో దివిస్ కంపెనీ నిర్మిస్తున్న ఉచిత ఆర్వో వాటర్ ప్లాంట్ల నిర్మాణం పూర్తి కానందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ శనివారం తెలిపారు. ఆగస్టు 15 నుంచి దేవస్థానంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం అమలవుతుందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో కేవలం గాజు సీసాలు, కాపర్, స్టీల్ సీసాలను మాత్రమే దేవస్థానంలో అనుమతిస్తామని ఈఓ చంద్రశేఖర్ అజాద్ వివరించారు.

నేత కార్మికులకు వృత్తి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న విజయవాడ చేనేత సేవా కేంద్రం డీడీ అనిల్ సాహు

పిఠాపురం: చేనేత కార్మికులకు మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా వృత్తిలో నైపుణ్యం సాధించేలా జౌళీ మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు విజయవాడ చేనేత సేవా కేంద్రం డీడీ అనిల్ సాహు తెలిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో చేనేత కార్మికుల శిక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని తాటిపర్తి, ప్రత్తిపాడులో రెండు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో కేంద్రంలో 20 మంది చొప్పున 40 మందికి శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణా కాలంలో ఒక్కొక్కరికి రూ.300 స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. మారుతున్న ట్రెండ్‌కు అనుకూలంగా కొత్త డిజైన్లు, లెనిన్ నేతలపై శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ శిక్షణా తరగతులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చేనేత జౌళీ శాఖాధికారి పెద్దిరాజు, సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, పలువురు అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

5న దిశ సమావేశం

కాకినాడ సిటీ: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటి (దిశ) సమావేశం ఈనెల 5వతేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశపు హాలులో జరుగుతుంది. దీనికి ఎంపీ వంగా గీత అధ్యక్షతన వహిస్తారని కమిటీ మెంబర్ సెక్రటరీ, కలెక్టర్ కృతికా శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేజీబీవీల్లో టీచింగ్ పోస్టులకు ఇంటర్వ్యూలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీ) ఖాళీగా ఉన్న 64 టీచింగ్ పోస్టులు కాంటాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ అన్నపూర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలాజీచెరువు పీఆర్ బాలుర పాఠశాలలో జిల్లా కమిటీ ద్వారా ఆది,సోమ వారాల్లో టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చిన తేదీ,సమయం ప్రకారం హాజరుకావాలని సూచించారు.

మైండ్‌బ్లౌజ్‌ంగ్..!

- రవికెల డిజైన్లలో సరికొత్త రకాలు
- రంగు రాళ్ల పూసలతో కొత్త హంగులు
- చీర ఖరీదును మించిపోతున్న జాకెట్
- మహిళలకు ఉపాధిగా మారిన నయా ట్రెండ్



సండే స్పెషల్

పిఠాపురం: ఒకప్పుడు ఫ్యాషన్ అంటే అర్బన్‌కే పరిమితం. కానీ కాలం మారింది. సరికొత్త ఫ్యాషన్లు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలనూ తాకుతున్నాయి. కొత్త పుంతలు తొక్కిస్తున్నాన్నాయి. ముఖ్యంగా మహిళల వస్త్రాల విషయంలో ఎప్పటికప్పుడు కొత్త మార్పులు వస్తున్నాయి. వారి అభిరుచులకు అనుగుణంగా చీరలే కాదు రవిక(జాకెట్)లూ కొత్త రూపాలను సంతరించుకుంటున్నాయి. జాకెట్ వస్త్రం ఖరీదు సాధారణమైనా దానిని కుట్టు మిషను మీద తీర్చిదిద్దడానికి బోలెడు ఖర్చవుతోంది. రూ.వెయ్యి నుంచి నుంచి రూ. 10వేల వరకూ కుట్టు వ్యయం అవుతుందంటే విస్తుపోవల్సిందే. గతంలో చీరకు తగ్గ రంగు జాకెట్‌ను మాత్రమే ఎంపిక చేసుకునేవారు. ఇప్పుడు కొత్త హంగులు వచ్చాయి. రకరాల రంగు రాళ్లు, పూసలు, గాజు ముక్కలు, ధారాలతో కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతులతో ఆకట్టుకుంటున్నాయి. శుభకార్యాలలో చీరల కంటే జాకెట్ల డిజైనింగుకే మగువలు అగ్రాసనమేస్తున్నారు.

మహిళలకు చేతినిండా పని

ప్రధాన నగరాలలో ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమైన ఫ్యాషన్లు అన్ని వర్గాలకూ వ్యాపించాయి. గ్లోబలైజేషన్, ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాల వల్ల ఫ్యాషన్లు ఇట్టే పై నుంచి కింది స్థాయికి చేరుకుంటున్నాయి. కొత్త డిజైన్లను మహిళలు ఎక్కువ ఇష్ట పడుతుండడంతో పల్లెల్లోన్లూ వీరి అభిరుచికి అద్దం పట్టేలా తయారీదారులు వస్తున్నారు. కొత్త డిజైన్లు తయారు చేయడానికి అధునాతన యంత్రాలను ఉపయోగిస్తున్నారు. కానీ కొంత వర్క్ చేయడానికి మహిళలు అవసరమవుతున్నారు. దీంతో వీరికి ఉన్న ఊళ్లోనే ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. చేతి కుట్లు, పూసలు తొడగడం, జాకెట్టు త్రెడ్‌లు, మ్యాచింగ్, పూసలు, అద్దాలు అలంకరించడం వంటి పనులలో ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారు. కాకినాడ, పిఠాపురం, తుని, పెద్దాపురం, సామర్లకోట తదితర ప్రాంతాల్లో భారీగా ఎంబ్రాయిడరీ వర్క్ సెంటర్లు వెలిశాయి. వీటిలో చాలామంది హెల్పర్లుగా, డిజైనర్లుగా పని చేస్తున్నారు.

చీరను మించి పోతున్న జాకెట్టు ధర

రూ.100 నుంచి రూ.లక్ష వరకు చీరల ధర ఉంటే ఇప్పుడు జాకెట్టు వాటికి పోటీ పడుతోంది. చీర ధర కంటే డిజైన్‌ను బట్టి జాకెట్టు ధర రెండు మూడు రెట్లు పెరుగుతోంది. మగ్గం వర్క్ మిషన్ ఎంబ్రాయిడరీ వర్క్, వైల్ డూయింగ్ వర్క్, కట్ వర్క్‌లు, ఇలా ఎన్నో రకాల వర్క్‌లు జాకెట్ ధరను పెంచేస్తున్నాయి. స్ప్రింగ్‌ను తలపించే జార్దోసీ గోల్డ్ సిల్వర్ దారంతో కుట్టే కుట్లకు ప్రత్యేక మార్కెట్ ఉంది. రకరకాల బీడ్స్ (పూసలు) స్టోన్స్‌తో తయారు చేసే షుగర్ బీడ్స్, సీడ్ బీడ్స్, జోర్డాన్ డైమండ్ స్టోన్స్, కుందన్ వర్క్,మిర్రర్ వర్క్‌లలో మీనా ఔట్‌లైన్ వర్క్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. వీటి ఖరీదు రూ.500 నుంచి రూ.10 వేల వరకు ఉంది. ప్రత్యేక రంగు రాళ్లతో ఆర్డర్లు ఇచ్చి తయారు చేయించుకుంటే రూ.25 వేల నుంచి రూ.70 వేల వరకు ఖరీదు పెట్టాల్సిందే. ఆభరణాలు వాడే జార్కన్ స్టోన్స్ డిజైన్లతో రూ.లక్ష వరకు జాకెట్‌కు వెచ్చించాలంటే విస్మయమే మరి.

వర్క్‌ను బట్టి రేటు



డిజైన్లను బట్టి వర్క్ ఉంటుంది. వర్క్‌ను బట్టి రేటు ఉంటుంది. డిజైన్లను బట్టి సమయం పడుతుంది. ఇవన్నీ రేటుపై ప్రభావం చూపిస్తాయి. ఎక్కువ డిజైన్లు ఉంటే ధర రూ.వేలల్లో ఉంటుంది. కొన్ని డిజైన్లకు 5 నుంచి 20 రోజులు పడుతుంది. మిషన్‌పై డిజైన్ కుట్టినా చాలా వర్క్ చేతితో చేయాలి. మాదగ్గర సుమారు 20 మంది మహిళలు పని చేస్తుంటారు. నెల రోజులు ముందుగానే ఆర్డర్లు ఇస్తుంటారు. కలకత్తా నుంచి కార్మికులను తీసుకు వచ్చి డిజైన్లు తయారు చేయిస్తుంటాము.

– సరోజ, నీరజా యంత్రాయిడరీ వర్క్ యజమాని, పిఠాపురం



కంప్యూటర్ డిజైన్‌ను మిషన్‌పై తయారు చేస్తున్న మహిళ



డిజైన్ వర్క్‌లను మిషన్‌పై తయారు చేస్తున్న మహిళలు



జాకెట్లకు డిజైన్లు సిద్ధం చేస్తున్న బెంగాలీ కార్మికులు

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి



సహకార ప్రతిజ్ఞ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, బ్యాంకు సిబ్బంది

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సహకార వ్యవస్థ బలోపేతానికి సిబ్బంది మరింత కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా స్థానిక డీసీసీబీ బ్యాంకు ఆవరణలో శనివారం ఆయన సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. వందేళ్లలో చరిత్ర ఉన్న సహకార వ్యవస్థను పటిష్టపరిచేందుకు కృషి చేస్తానన్నారు. సహకార వ్యవస్థలోను ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. గతంలో సహకారబ్యాంకులు ద్వారా వ్యవసాయ రుణాలు మాత్రమే ఇచ్చావారన్నారు. ప్రస్తుతం రైతులకు అవసరమైన అన్ని రకాలు రుణాలు ఇస్తున్నామన్నారు.డీసీసీబీ డైరెక్టర్లు పంతం భవానీరామ్, మెహిద్దీన్, డీసీసీబీ జీఎంలు ప్రవీణ్‌కుమార్, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పవరం సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్



వీవీఎల్ నరసింహారావు

కాకినాడ లీగల్: సర్పవరం సబ్ రిజిస్ట్రార్ వీవీఎల్ నరసింహారావును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇటీవల టీడీఆర్ బాండ్ల విషయంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు, ఆయనపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకుంది. 2020 మార్కెట్ వాల్యూ రివిజన్ పుస్తకంలో కొన్ని డోర్ నంబర్లు విలువ కంటే ఆన్‌లైన్‌లో కొన్ని డోర్ నెంబర్లకు తక్కువ విలువ నమోదు చేశారు. ఇటువంటి చర్యల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వచ్చిన వైనాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ సస్పెన్షన్ విషయాన్ని స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖ ఉమ్మడి జిల్లా డీఐజీ ఎ.నాగలక్ష్మి ధ్రువీకరించారు.

చంద్రబాబు హయంలో అట్టడుగు స్థానానికి రాష్ట్రం



ఎస్.అన్నవరం జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: మాజీ సీఎం చంద్రబాబునాయుడి హయాంలో వ్యవసాయం 26వ స్థానంలో ఉండగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ఇప్పుడు ఆరో స్థానంలో నిలిచిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు కుల, ఆదాయ తదితర సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయంలో రాష్ట్రం అథోగతిపాలై, దేశంలో అట్టడుగు స్థానంలో నిచిందన్నారు. అందరికీ అన్నం పెట్టే అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను వ్యవసాయంలో 26వ స్థానానికి దిగజార్చింది చంద్రబాబే అన్నారు. పట్టుదల, కృషితో సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని దేశంలో మొదటి ఐదు స్థానాల్లో నిలబెట్టారన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు కక్కుర్తిపడి ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి రూ.500, రూ.వెయ్యి చొప్పున దండుకున్నారన్నారు. తమది 40 ఏళ్ల రాజకీయ చరిత్రని గొప్పలు చెప్పుకుంటూ మోకాళ్లపై ఇంటింటా నడుస్తున్న యనమల రామకృష్ణుడిని ప్రజలు నమ్మబోరనన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేర్చాలన్న లక్ష్యంతో గడప గడపకూ వెళ్లే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎటువంటి సాంకేతిక సమస్యలు ఉన్న పరిష్కరించి 11 రకాల సేవలను ఉచితంగా అందించే కార్యక్రమమే జగనన్న సురక్ష అన్నారు. ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ బొప్పన రాము, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, మండల వ్యవసాయ సలహ మండలి చైర్మన్ చోద్రాజు రాంబాబు రాజు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



ఎస్.అన్నవరంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి

కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే కన్నబాబు

కరప: అర్హులందరికీ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు నూరుశాతం చేరాలనే లక్ష్యంతో రాష్ట్రం ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. స్థానిక చిరంజీవి కళ్యాణమండపంలో శనివారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆమె జగనన్న సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా వారంరోజులుగా జిల్లాలోని 620 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఇంటింటా సర్వేచేశారన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించారన్నారు. వీటిని సచివాలయాల వారీగా జగనన్న సురక్ష శిబిరాల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓల ఆధ్వర్యంలో ఇందుకు బృందాలు పని చేస్తాయన్నారు. ఇప్పటికే 99 శాతం లబ్ధిదారులకు జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలు చేరువయ్యాయన్నారు. కరప శిబిరంలో నివాస, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తదితరాలను ఉచితంగా అందిస్తున్నట్టు వివరించారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ దేశచరిత్రలో ఎక్కడాలేనివిధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వినూత్న కార్యక్రమాలు అమలుచేస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్ల, సచివాలయ వ్యవస్థల ద్వారా పాలనలో విప్లవాత్మకమైన మార్పుకు కరపలోనే శ్రీకారంచుట్టారన్నారు. ఇప్పుడు ప్రజలముంగిటకెళ్లి సేవలందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కూడా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నను. అందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్షాలుచేస్తున్న నిరాధార ఆరోపణలను పట్టించుకోకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో రబీలో సాగునీటి ఎద్దడినుంచి గట్టెక్కామన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నబాబులు సర్వీస్ రిక్వెస్ట్, స్పాట్ రిజిస్ట్రేషన్ కౌంటర్లను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. డీఎల్‌డీఓ పాటంశెట్టి నారాయణమూర్తి స్వాగతంపలికి, వందన సమర్పణ చేశారు. గ్రామసర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీసభ్యుడు యాళ్ల సుబ్బారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వివిధగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కరపలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢ త్రయోదశి పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వ్రతమండపాలు, క్యూ లైన్లు, స్వామివారి ఆలయం భక్తులతో నిండిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

నేడు, రేపు రద్దీ కొనసాగే అవకాశం

సెలవు దినం కావడంతో ఆదివారం, ఆషాఢ పౌర్ణిమ సందర్భంగా సోమవారం సత్యదేవుని ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. తలుపులమ్మ లోవకు వెళ్లే భక్తులు తిరిగి ప్రయాణంలో కొండ దిగువన ప్రసాదం కౌంటర్ల వద్ద ఆగి స్వామివారి ప్రసాదం కొనుగోలు చేస్తారు. ఈ మేరకు లక్ష ప్రసాదం ప్యాకెట్లను స్టాక్ పెడుతున్నట్లు అధికారులు తెలిపారు.



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అందరికీ అందుబాటులో ఇసుక... పారదర్శక విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక...



శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

కాకినాడ జిల్లాలో నియోజకవర్గాల వారీగా రీజనబుల్ రవాణా ఛార్జీలతో కలిపి టన్నుకు ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ధరల వివరాలు ప్రక్కన ప్రకటిస్తున్నాం. జిల్లాలో ఇంతకన్నా ఎక్కువ ధరకు ఎవరైనా మీమీ నియోజకవర్గాల్లో అమ్మితే SEB ఫోన్ నెంబర్ - 94906 18510 కు ఫిర్యాదు చేయండి.. ఎవరైనా ఇంతకన్నా ఎక్కువ ధరకు అమ్మితే 2 లక్షల వరకు జరిమానా, 2 ఏళ్ల జైలు శిక్ష.. రెండూ విధిస్తారు. అన్ని రీచ్‌ల వద్ద ఇసుక గరిష్ట అమ్మకపు ధర టన్నుకు రూ. 475/- మాత్రమే..

నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర	నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర
తుని	రూ. 900/-	కాకినాడ సిటీ	రూ. 930/-
ప్రత్తిపాడు	రూ. 885/-	కాకినాడ రూరల్	రూ. 930/-
జగ్గంపేట	రూ. 885/-	పెద్దాపురం	రూ. 850/-
పిఠాపురం	రూ. 745/-		

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గనులు మరియు భూగర్భ శాఖ

★ రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మరింత తక్కువ ధరకు అందేలా అన్ని ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి వచ్చాయి..
★ ఇసుక బ్లాక్ మార్కెటింగ్, ట్రాన్స్ పోర్టర్ల సిండికేట్ లకు చెక్ పెడుతూ ఆన్ లైన్‌లో, ఆఫ్ లైన్ తో పాటు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఇసుక బుకింగ్ మరియు డోర్ డెలివరీ సదుపాయం..
★ www.andhrasand.com ద్వారా ఇసుక ఆన్‌లైన్ లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించిన JPVL సంస్థ..
★ అందరికీ అందుబాటు ధరలో నాణ్యమైన ఇసుక పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14500
వినియోగదారుల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 97000 09944

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీ, గనులు, భూగర్భ వనరుల శాఖామాత్యులు

క్లుప్తంగా

ఎంఈఓ-1 పోస్టుల భర్తీకి నేడు కౌన్సెలింగ్

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాఠశాల విద్యాశాఖ జోన్-2 పరిధిలో ఎంఈఓ-1 పోస్టుల భర్తీకి ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు కాకినాడ ఆర్‌జేడీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆర్‌జేడీ జి.నాగమణి శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. జోన్-2 పరిధిలో 98 ఎంఈవో-1 పోస్టులను ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని గ్రేడ్-2 ఉపాధ్యాయులతో భర్తీ చేయనున్నామన్నారు. కౌన్సెలింగ్‌కు 47 మందిని మాత్రమే పిలుస్తున్నట్టు సమాచారం.

నేడు స్కూల్ అసిస్టెంట్ల సర్టిఫికెట్ల పరిశీలన

గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతుల సీనియారిటీ జాబితాలోని ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆదివారం నిర్వహించనున్నారు. కాకినాడ జిల్లా విద్యా శాఖాధికారి కేఎస్‌పీఎస్ అన్నపూర్ణ ఈ విషయం తెలిపారు. ఇప్పటికే సీనియారిటీ జాబితాలను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఉదయం 10.30 గంటలకు తన కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సంబంధిత ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు.

కుమార్తెను చూడటానికి వచ్చి.. లారీ ఢీకొని..


మృతి చెందిన నరసింహమూర్తి

పెరవలి: అనారోగ్యంతో బాధ పడుతున్న కుమార్తెను చూడటానికి వచ్చిన ఓ తండ్రిని మృత్యువు కబళించింది. పెరవలి ఎస్సై ఎం.సూర్యభగవాన్ కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా వేంద్ర గ్రామానికి చెందిన పాలా నరసింహమూర్తి (65) తన కుమార్తెను చూడటానికి శనివారం సాయంత్రం పెరవలి వచ్చాడు. రోడ్డు దాటుతూండగా రావులపాలెం నుంచి తణుకు వైపు వెళ్తున్న లారీ అతడిని ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిపోయిన నరసింహమూర్తి తలకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు పరుగున వచ్చి నరసింహమూర్తికి పరిచర్యలు చేశారు. అయితే, అంబులెన్స్ వచ్చే లోపు అతడు మృతి చెందాడు. దీంతో నరసింహమూర్తి బంధువుల కన్నీరుమున్నీరుగా విలపించారు.

బస్సు, లారీ ఢీ

దేవరపల్లి: గోపాలపురం వైఎస్సార్ జంక్షన్‌లో శనివారం ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. రాజమహేంద్రవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జంగారెడ్డిగూడెం నుంచి 46 మంది ప్రయాణికులతో రాజమహేంద్రవరం వెళ్తోంది. అదే సమయంలో ఖమ్మం నుంచి రాజమహేంద్రవరం వైపు లారీ వెళ్తోంది. ఈ రెండూ ఢీకొనడంతో బస్సు ముందు భాగం దెబ్బ తింది. అందులోని పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రయాణికులను పోలీసులు వేరే బస్సులో గమ్యస్థానాలకు పంపించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

GROUP-II (Preliminary) 9-7-23
ఫ్రీ కౌన్సెలింగ్ క్లాస్
క్లాసెస్ ప్రారంభం: 12-7-23, ఉదయం 9 గంటలకు
SATYAM STUDY CIRCLE
కాకినాడ 9849238377, 9948645434

పరీక్ష ఫెయిలైన వారికి వరం

- రెగ్యులర్‌గా చదివే అవకాశం కల్పించిన ప్రభుత్వం
- ఉన్నత స్థాయి చదువులే లక్ష్యంగా అడుగులు
- మిషన్ 100 శాతం జీఈఆర్‌లో భాగంగానే ఈ అవకాశం
- విద్యా రంగంలో విప్లవాత్మక నిర్ణయం



రాయవరం: గతంలో పబ్లిక్ పరీక్షలు తప్పితే సెప్టెంబర్, మార్చిలో జరిగే సప్లిమెంటరీ పరీక్షలు వరుసగా రాసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. అందుకే గతంలో వచ్చిన శివ సినిమాలో 'ఉందిగా సెప్టెంబరు మార్చి పైన' అంటూ ఫెయిలైతే బాధ పడవద్దంటూ సినీ కవి వ్యంగ్యంగా వర్ణించాడు. గతంలో ఆ పాట యువత నోట్లో నానేది. ఇకపై అలా పాడుకోవాల్సిన అవసరం లేదు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు ఎదుర్కొనే తొలి పబ్లిక్ పరీక్ష పదో తరగతి. వీటిలో ఫెయిలైతే సప్లిమెంటరీ తిరిగి రాసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. సప్లిమెంటరీలో కూడా ఫెయిలైతే తిరిగి పదో తరగతి ఉత్తీర్ణత పొందే వరకూ సప్లిమెంటరీ పరీక్షలు రాస్తూనే ఉండాలి. అయితే, ప్రభుత్వం తాజాగా తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం టెన్త్, ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు వరంగా మారనుంది. వీరికి తిరిగి రెగ్యులర్‌గా చదువుకునే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఫెయిలైన విద్యార్థులు చదువు మానేస్తున్నారని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం.. తిరిగి వారు రెగ్యులర్ తరగతుల్లో చేరేందుకు అనుమతించి, మళ్లీ చదువుకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు వలంటీర్ల ద్వారా మిషన్.విజన్ పేరుతో ఈ ఏడాది ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ అమలు చేస్తున్నారు. దీని ద్వారా ఫెయిలైన విద్యార్థులను పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించేందుకు విద్యా శాఖ చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నా, మెరుగైన జీవనోపాధి పొందాలన్నా టెన్త్, ఇంటర్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన జీఈఆర్

నాలుగేళ్లుగా ప్రభుత్వం 100 శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సాధనకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా జగనన్న అమ్మ ఒడి, విద్యార్థుల ఆరోగ్యానికి జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రోజుకొక మెనూ అమలు, వారానికి ఐదు రోజులు కోడిగుడ్డు, రోజు విడిచి రోజు చిక్కీ, రాగిజావ అందిస్తోంది. అలాగే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు బైలింగ్విల్ పాఠ్య పుస్తకాలు ప్రవేశపెట్టింది. జగనన్న విద్యా కానుక కింద విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, ఇతర వస్తువులు ఉచితంగా సమకూరుస్తోంది. మన బడి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది.

ప్రభుత్వ చర్యలతో గతంలో ఎన్నడూ లేని విధంగా జీఈఆర్ గణనీయంగా పెరిగింది. 2018-19లో ప్రాథమిక స్థాయిలో జీఈఆర్ 92.91 శాతం ఉండగా, 2022-23 విద్యా సంవత్సరంలో 100.80 శాతానికి చేరింది. సెకండరీ స్థాయిలో 79.69 నుంచి 89.63కు, హయ్యర్ సెకండరీ స్థాయిలో 46.88 నుంచి 69.87 శాతానికి పెరిగింది. నాలుగేళ్లుగా అద్భుత ప్రగతి ఉన్నప్పటికీ ప్రభుత్వం 'మిషన్ 100 శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రోగ్రామ్' అమలు చేస్తోంది.

2005 సెప్టెంబర్ ఒకటి నుంచి 2018 ఆగస్టు 3వ తేదీ వరకూ ప్రతి ఒక్కరూ ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఏదో ఒక తరగతి చదువుతూ ఉండడమే ఈ కార్యక్రమం లక్ష్యం. మిషన్ 100 శాతం జీఈఆర్ సాధనలో భాగంగానే 10వ తరగతి, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు తిరిగి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. వీరికి జగనన్న అమ్మ ఒడి, విద్యాకానుక, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయనున్నారు. టెన్త్, ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులతో పాటు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కాని వారు కూడా తిరిగి పాఠశాలలు, కళాశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాల్లో టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు ఇలా..

జిల్లా	హాజరు	ఫెయిల్
కోనసీమ	5,773	1,081
కాకినాడ	9,630	2,799
తూర్పు గోదావరి	8,051	4,156
మొత్తం	23,454	8,036

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

సంవత్సరం	హాజరు	పాస్	ఫెయిల్
ఫస్టియర్	10,458	3,604	6,854
సెకండియర్	10,200	3,360	6,840

అద్భుత అవకాశం



టెన్త్, ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు తిరిగి రెగ్యులర్‌గా చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. వారికి ఇది ఒక అద్భుత అవకాశం. రెగ్యులర్‌గా చదువుకునే అవకాశం ఉండటంతో ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలూ పొందే అవకాశముంటుంది. విద్యకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యం కారణంగా గత నాలుగేళ్లలో జీఈఆర్ గణనీయంగా పెరిగింది.

– జి.నాగమణి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యా శాఖ, కాకినాడ

జియో సైన్సెస్‌లో పట్టు సాధించాలి


మెరిట్ విద్యార్థులకు మెమోరియల్ అవార్డులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: జియో సైన్సెస్‌లో పట్టు సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య టి.అశోక్ అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో సైన్సెస్ ఆధ్వర్యాన డాక్టర్ డీఎస్ఎన్ రాజు అండ్ ఎంవీజీ సుబ్రహ్మణ్యం మెమోరియల్ లెక్చర్ సిరీస్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. హైడ్రోకార్బన్ల అన్వేషణలో మైక్రోపాలియెంటాలజీ అప్లికేషన్ నైపుణ్యంపై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఓఎన్‌జీసీ రిటైర్డ్ చీఫ్ జియోలజిస్టు డాక్టర్ ఎ.నల్లప్పరెడ్డి మాట్లాడుతూ, శాస్త్రరంగంలో డాక్టర్ డీఎస్ఎన్ రాజు అందించిన సేవలను కొనియాడారు. ఓఎస్ జియో - ఇండియా మాజీ డైరెక్టర్, జీఎస్ఐ సెక్రటరీ ఉండవల్లి రవికుమార్ మాట్లాడుతూ, ఆచార్య మహదేవన్ సేవలను వివరించారు. సీనియర్లు అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని అద్భుత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. డాక్టర్ డీఎస్ఎన్ రాజు మెమోరియల్ అవార్డ్స్ అండ్ మెరిట్ సర్టిఫికెట్లను ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కుడుపూడి శ్రీసంధ్య, తిక్కా ఛరిష్మా నిధిలకు, మాసా ఫెలోషిప్‌ను మొదటి సంవత్సరం టాపర్ కుడుపూడి శ్రీసంధ్యకు అందజేశారు. హెచ్‌ఓడీ ఆచార్య వై. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ కేపీ స్వామి, డాక్టర్ కె.శామ్యూల్ పీటర్, డాక్టర్ కె.సుధారాణి, డీవీ తేజ, డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు, డాక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

మందపల్లికి పోటెత్తిన భక్తులు

- శనైశ్చరునికి భక్తుల పూజలు, తైలాభిషేకాలు
- దేవస్థానానికి రూ.13.61 లక్షల ఆదాయం


స్వామి దర్శనం, తైలాభిషేకాలకు బారులు తీరిన భక్తులు

కొత్తపేట: అమావాస్య ముందు వచ్చిన శని త్రయోదశి పర్వదినం సందర్భంగా మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. జాతకంలో శని మహాదశ, అష్టమ శని, అర్ధాష్టమ శని నడుస్తున్న వారు శని త్రయోదశి నాడు శనైశ్చరునికి పూజలు, తైలాభిషేకాలు చేయిస్తే శని దోషం తొలగిపోతుందని పండితులు చెబుతారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి నుంచే మందపల్లికి భక్తుల రాక ప్రారంభమైంది. తెల్లవారేసరికి క్రమంగా పెరిగిపోయి, క్షేత్రం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణం, వెలుపల, వెనుక పూజల ప్రాంగణంలో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి తైలాభిషేకాలు చేశారు. స్వామి వారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తైలాభిషేకాలు, ప్రత్యక్ష సేవల ద్వారా దేవస్థానానికి రూ.10,16,535, పరోక్ష, ఆన్‌లైన్ సేవల ద్వారా రూ.3,45,050 కలిపి మొత్తం రూ.13,61,585 ఆదాయం సమకూరిందని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ తెలిపారు. స్వామివారిని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ, వివిధ జిల్లాల రెవెన్యూ, పోలీసు శాఖల ఉన్నతాధికారులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పూజాదికాలు నిర్వహించారు. ఆ ఆలయంలో గాలి లేక చెమటతో తడిసిపోయి, స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కొంతసేపు బయటకు వచ్చి, తిరిగి లోపలికి వెళ్లి పూజ పూర్తి చేశారు. మందపల్లి క్షేత్రంతో పాటు ఇతర దేవస్థానాల అధికారులు, సిబ్బంది కూడా విధుల్లో పాల్గొన్నారు. వానపల్లి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఆధ్వర్యాన పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఘాటెక్కిన మిర్చి

- 10 కిలోలు రూ.1,550కి విక్రయించిన రైతులు
- ఇంత రేటు ఇదే తొలిసారి అంటున్న వ్యాపారులు, రైతులు



ఆలమూరు: పచ్చిమిర్చి రోజురోజుకూ మరింత ఘాటెక్కిపోతోంది. వేసవి ప్రభావంతో దిగుబడులు గణనీయంగా పడిపోవడంతో తగినంత ఉత్పత్తి లేక ధర ఎగబాకుతోంది. ఆలమూరు మండలం మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో శనివారం రైతుల నుంచి వ్యాపారులు 10 కేజీల మిర్చిని రూ.1,550కి కొనుగోలు చేయడం అందరినీ ఆశ్చర్యపరచింది. ఉదయం రూ.1,390 నుంచి ప్రారంభమైన మిర్చి ధర కాగా సాయంత్రానికి రూ.1,550 వరకూ పలికింది. రాష్ట్ర మిర్చి మార్కెట్ చరిత్రలో రికార్డు స్థాయిలో ఇంత ధర పలకడం ఇదే ప్రథమమని రైతులు చెబుతున్నారు. దీంతో బహిరంగ మార్కెట్‌లో కేజీ మిర్చి రూ.200 వరకూ పలికింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మిర్చి ధర మరింత పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జాతీయ విద్యా విధానంలో మాతృభాషకు ప్రాధాన్యం

- యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్ కుమార్
- ఏపీ ఉన్నత విద్య ప్రణాళిక బోర్డు సమావేశాలు ప్రారంభం


సమావేశాలను ప్రారంభిస్తున్న యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్ కుమార్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జాతీయ విద్యా విధానంలో మాతృభాషకు ప్రాధాన్యం ఇస్తున్నామని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ ఎం.జగదీష్ కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య ప్రణాళిక బోర్డు ఐదో సమావేశాలు జేఎన్‌టీయూ-కాకినాడలో శనివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వర్సిటీల ఉప కులపతులతో రెండు రోజులు జరిగే ఈ సమావేశాల్లో ప్రొఫెసర్ జగదీష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యలో పెరుగుతున్న అసమానతలను తగ్గించేలా పెద్ద లక్ష్యాలు ఏర్పరచుకోవాలన్నారు. మంచి చదువు అందించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. న్యాక్, ఎన్‌బీఏ తదితర సంస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా పాఠశాల స్థాయిలో నైపుణ్య విద్య (స్కిల్ ఎడ్యుకేషన్) అందిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 30 శాతం మందికి నైపుణ్య విద్య అందించడం సంతోషకరమని ప్రొఫెసర్ జగదీష్ కుమార్ ప్రశంసించారు. రాష్ట్ర ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శి శ్యామలరావు మాట్లాడుతూ, జాతీయ విద్యావిధానం అమలులో ఏపీ ముందంజలో ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఉన్నత విద్య ప్రవేశాల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోను 37.2 శాతానికి పెంచామని ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థులకు సాంకేతికపరంగా మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టామని కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్ చెప్పారు. మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ రీసెర్చ్‌లో భాగంగా జేఎన్‌టీయూకేలో ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సులు ప్రారంభిస్తున్నామని జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. అనంతరం ఉన్నత విద్యపై ఉన్నత విద్యా మండలి రూపొందించిన ఎన్ఈపీ-2020 అమలు ప్రణాళిక, నైపుణ్యాభివృద్ధి, డిగ్రీ విద్యార్థులకు రూపొందించిన ద్విభాషా (తెలుగు, ఇంగ్లిష్) పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి కార్యదర్శి వై.నజీర్, జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ VEDA Educational Consultancy: For B.E / B.Tech / B.Pharm / Pharm - D / B.B.A + M.B.A / M.S Food Science, M.BA / M.Sc / M.A. / Ph.D Seats in AU Campus / Universities / Colleges. Ph: 93475 62708 [V-794575]

DISTANCE EDUCATION

■ టెన్త్, ఇంటర్ వన్ సిట్టింగ్ రెగ్యులర్ ఇంటర్‌లో ఫెయిలయిన వారికి కట్టుకునే అవకాశం. డిగ్రీ & పీజీ, సైన్స్ & ఆర్ట్స్, MBA, BLi.Sc. నాగార్జున, ఆంధ్ర, వెంకటేశ్వర యూనివర్సిటీల ఎగ్జామ్స్ అన్నీ మా కాకతీయ విద్యాసంస్థలలో జరుగును. 100% పాస్. అడ్మిషన్లు జరుగుచున్నవి. కాకినాడ దగ్గరలో గల గొల్లపాలెం, రాజమండ్రి, అత్రేయపురం. ఫోన్: 99494 82757, 98495 82043 [V- 1958]

Real Estate

LAND DEVELOPMENT

■ RJY, దివాన్ చెరువు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా, బీజాపూర్ లే అవుట్‌లో షిరిడిసాయి స్కూలు ప్రక్కన E/W ఫేసింగ్ రోడ్ చ॥గ॥ 72x110 = 880 చ॥గ॥లు స్థలం డెవలప్‌మెంట్‌కు ఇవ్వబడును. ఫోన్: 96761 44027 [V-1983]

FLAT FOR SALE

■ కాకినాడ గాంధీనగర్‌లో 2BHK పెంట్‌హౌస్ & వెంకటరత్నాపురంలో సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ అమ్మకం. ✆ : 98482 85844. [R-1841]

■ రాజమండ్రి జె.ఎన్.రోడ్డు AKC కాలేజ్ రోడ్‌లో సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న కొత్త అపార్ట్‌మెంట్‌లో 3000 Sft, E/F, 4 BHK ఫ్లాట్ అన్ని సౌకర్యాలతో అమ్మకమునకు కలదు. సంప్ర : 98482 72317 [V-1923]

■ RJY, దివాన్‌చెరువు గైట్ కాలేజ్ ఎదురుగా NH-5కి చేర్చి బ్రిడ్జికౌంటీలో 3 BHK ఫ్లాట్స్ E/F 1400 Sft., 4వ ఫ్లోరు & N/F 1700 Sft., 3rd ఫ్లోర్ అమ్మకము. ఫోన్ : 96761 44027 [V-1981]

■ కాకినాడ, గాంధీనగర్ మాధవరావు వీధిలో (పాత పోస్టాఫీసు వీధి) A.M.స్వామి ప్యారడైజ్ ఫామ్స్ అపార్టుమెంటు నందు 3 BHK 1800 Sft. & 1856 Sft. ఈస్ట్ ఫేసింగ్ ఫ్లాట్స్ (ఫ్లోర్‌కు 2 మాత్రమే) కారు పార్కింగ్‌తో అమ్మకము. Ready to Occupy. 94401 77259 [R-74]

■ Luxury Flats 2 & 3 BHK with quality construction with all facilities at reasonable price in Katari Residency, Back side of TTD Function Hall Pindiproluvari Street, Balajicheruvu Centre, Kakinada. ✆ : 98480 47799 [R-70]

HOUSE FOR SALE

■ రాజమండ్రి, కొంతమూరులో 111 చ॥గ॥ W/F గృహ ప్రవేశానికి సిద్ధం E/F 122 & 183 చ॥గ॥ నూతన నిర్మాణంలో గల ఇండివిడ్యువల్ బిల్డింగ్స్ లోన్ సౌకర్యంతో అమ్మకం. ✆ : 97051 07150 & 93929 09334 [R-24]

■ బొమ్మూరు AMG స్కూల్ ఎదురుగా గాయత్రీనగర్ మెయిన్‌రోడ్ దగ్గరగా ఈస్ట్ ఫేసింగ్ 2 BHK ఇండివిడ్యువల్ House అమ్మబడును. ఫోన్ : 96761 44027 [V-1984]

■ 255 చ॥గ॥లు 2000 Sftలో గల నివాసయోగ్యమైన డాబా ఇల్లు అమ్మబడును. తోరం వారి వీధి, రాజగోపాల్ సెంటర్, రామచంద్రపురం. ఫోన్ : 98491 56407 H [V-1925]

SITE FOR SALE

■ Kakinada రామారావుపేట Union Bank ప్రక్కన Gowthami Apartment Block -I లో T3 (E/F) 2BHK (Plinth Area 700 Sq.Ft) 47 Sq yds Undivided Share స్థలంతో అమ్మకమునకు కలదు. ✆ : 63013 57363, 63021 11844 [R-1842]

■ కాకినాడ దగ్గరలో నడకుదురు మెయిన్‌రోడ్ సమీపంలో తూర్పుఫేసింగ్ 221 చ॥గలు DTCP లేఅవుట్‌లో స్థలం అందుబాటులో ధరలో కలదు. వివరాలకు : 70839 97777, 99121 75725 Si[V- 1970]

LEASE

■ సత్తెనపల్లి 10 Km దూరంలో అన్ని వసతులతో సిద్ధంగా ఉన్న 10 ఎకరాలలో చేపల చెరువుకు లీజుకు ఇవ్వబడును. 9948356460, 8309674662 [G-787693]

LEASE / SALE

■ పౌడర్ కోటింగ్ ఫర్నిచర్ ఇండస్ట్రీ (మంచి రన్నింగ్ కండీషన్‌లో వున్న) లీజుకు గాని అమ్మకమునకు గాని కలదు. సెల్ : 9885564599 [G-209]

PLOT FOR SALE

■ ధవళేశ్వరం, ముత్యాలమ్మ నగర్‌లో 4 హౌస్ సైట్స్ మొత్తం 870 చ॥అ॥ (LRS అప్రూవల్) అపార్టుమెంట్ డెవలప్‌మెంట్‌కు లేదా మొత్తంగా గానీ విడివిడిగా అమ్మబడును. ✆ : 62811 75762, గుంటూరు [R-4643]

■ రాజానగరం ADB రోడ్‌ని అనుకుని గేటెడ్ కమ్యూనిటీలో DTCP అప్రూవ్డ్ వెంటనే ఇల్లు కట్టుకొనుటకు వీలుగా ఉన్న E/F 183 చ॥గ॥ (2 ప్లాట్స్) అమ్మకము. ✆ : 98480 73190 [R-5925]

■ 183 SqYds East Facing RUDA Open Plot at Diwancheru, RJV Gated Colony for Rs. 20 Lakhs. Ph: 9849454843 [HA-3031]

■ కాకినాడ పళ్ళంరాజు నగర్‌లో నార్త్ ఫేసింగ్ 267 గజాలు మరియు అచ్చంపేట సెంటర్‌లో మెడికవర్ హాస్పటల్ ఎదురుగా నార్త్ ఫేసింగ్ 209 గజాలు అమ్మకంనకు కలవు. ఫోన్ : 96526 03623 [V-1982]

■ శ్రీ కృష్ణా లే అవుట్, చౌడేశ్వరి నగర్ నందు గల (50×75=416) చ. గజాలు, అమ్మ బడును. స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ, లాల చెరువు హైవే నుండి 1.5km, రాజమహేంద్ర వరము లోకల్, తూ.గో. జిల్లా 9441530968, 8179047240. [C-1216555]

■ కాకినాడ స్మార్టుసిటీ : కాకినాడ అతిచేరువలో తిమ్మాపురం ఊరును అనుకొని ఇల్లు కట్టుకోవడానికి సిద్ధముగా ఉన్న KUADA Approved లే అవుట్‌లో ఇండివిడ్యువల్ Plots కలవు. 50% బ్యాంక్ లోన్. ఫోన్ : 96767 17778 P [V-1942]

Services

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 S [R-5963]

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్.9310515624, 8800496710. [DA-37247]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2363]

ASTROLOGY

■ ఏమిటి మీ సమస్య ? మీకు జనాకర్షణ - ధనాకర్షణ కావాలా? మీ శత్రువులు- మిత్రులుగా మారాలా? నరఘోష తొలగి ప్రశాంతత కావాలా? శనిదోష, రాహు, కేతు, కుజ, కాలసర్పదోష మొ॥ వాటికి దోష నివారణ, విద్య, ఆరోగ్యం, వ్యాపారం, ఉద్యోగం, కోర్టు, వివాహం మొ॥లగు చిక్కు సమస్యల నుండి మీకు అనుకూల వాతావరణం, సమస్య ఏదైనా, ఎక్కడైనా - ఎంత పెద్దదైనా, విశ్వకర్మ. ఆర్.సి.పురం ✆ : 98491 05346 [R-83]

Wanted

■ Wanted Civil Engineers - 2, ITI - Electrical -2, Plumber-2 Field Manager - (F) For a corporate Company @ KKD/RJY ✆ : +91 95736 82244 [R-1234185]

■ Experienced, Qualified Teachers to teach English, Maths, NS, PS. Sadhana High School, Tilak St., Kakinada ✆ : 98482 26333 [R-82]

■ B.Sc,Nurse/GNM కావలెను. రిజిస్టర్ సర్టిఫికేట్ ఉండవలెను. సంప్రదించండి: నయన ఐ కేర్, శ్రీనగర్, భానుగుడి, కాకినాడ - 3, ఇంటర్వ్యూ: 03-07-2023 (సోమవారం) మ॥ 12 గం॥ నుండి 4 గం॥ వరకు [R-15569]

■ వేమగిరి, బొమ్మూరు, ధవళేశ్వరం పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 8 Hrs. శాలరీ: రూ.10,000/-. సంప్రదించండి. ✆ : 86392 52628 [R-79]

■ RJY మొగల్ బిర్యానీ ప్యాలెస్ రెస్టారెంట్ నందు పనిచేయుటకు అనుభవం గల వెయిటర్స్, స్టీవార్డ్స్, క్లీనింగ్ స్టాఫ్ (F), వాచ్‌మెన్. 9 వేలు పైన జీతం + వసతి + భోజనం. అ: 10th ఆపైన. Cell: 94901 86188 [R-4642]

■ అంజన్న హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవచేయుటకు Exp. స్త్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 20,000/- నుండి 26,000/- వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో, Hyd. ఫోన్ : 9966568882, 9963489661. [HA-307]

■ Hydలో 24 గం॥ ఇంట్లోనే ఉంటూ వంట, ఇంటి పని, బేబీ కేర్, పేషెంట్ కేర్ చేయుటకు స్త్రీలు కావలెను. వ॥ 18 to 45. జీతం : 15000-25000, భోజన వసతి ఫ్రీ ✆ 73864 44217, 96661 28467 [B-786379]

WANTED
Marketing Executives
Asst. Managers
Managers
Delta HOSPITALS
www.deltahospitals.com
Venkateswara Nagar, Rajamahendravaram
Ph: 86889 19363.

■ Urgent requirement of Teachers for Sri Academy Primary Teachers (6-9pm) Maths teachers for 6,7,8 classes (6.30-9pm) Ph 9603444791,RJY. [C-1216556]

■ గుంటూరు సమీపములో గల ఆఫీసులో ఉండి పనిచేయుటకు టైపింగ్, డ్రైవింగ్ చేయగల జూనియర్ లాయర్లు & కనీసం 10th చదివిన డ్రైవర్లు కావలెను. ✆ 7207007725 / 9666114383 [G-781708]

■ మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221332]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K హైదరాబాద్ : 98402 58899, విజయవాడ: 96406 48899 [HA-337]

■ బ్యాంక్‌లలో (ఆఫీస్ వర్క్స్) పర్మినెంట్‌గా Q: 10th- డిగ్రీ జీ॥ 26,000/- కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ @Ph: 8332809093 [H-189352]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/-, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. ఫోన్ : 8919613984. [HA-366]

■ 10th/ఇంటర్ ఆపై చదివిన చురుకైన ఏ బాదరబందీ లేని యువతి హైదరాబాద్‌లోని విద్యావేత్తకు పర్సనల్ సెక్రటరీగా (పర్మినెంట్ పోస్ట్) కావలెను. ఉచిత వసతి భోజనం మంచి శాలరీ. 9985187777 [H-780833]

■ శ్రీసాయిరాం హోమ్‌కేర్ Hydలో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసు కొనుటకు స్త్రీ/పు.కావలెను. జీతం: 18000/- ఏజెంట్ కమీషన్ 7K. 96660 01826, 96660 01827 [H-189351]

■ కాకినాడ సూర్యారావుపేట డోర్స్ కంపెనీ నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి. ✆ 88826 56789 [B-181]

■ Wanted Exp, Qua Regular Physics -1 post (30k pm), IIT Chemistry -1 post (32k pm) with free food & accom. Contact: 9490551116 9319979999 St.Antonys high school, Porumamilla, YSR Kadapa (district). [C-1161050]

■ Wanted Teachers I to X (E.M) LKG to 5th Mother Teacher & 6th to 10th : All subjects. To Work at V.J.H.School, Nadakuduru. Cont. ✆ : 98485 32277 [R-68]

■ Wanted Marketing Incharges. Qualification: Any Degree. Salary: 20000/- to 25000/- Experienced Persons Preferrable, Age: 25 to 45. Job Location: Rajahmundry. Master Minds College. Contact: 92487 33370 [G-4404]

■ Wanted all subject lecturers for College and Teachers for School, Sanskrit, English, Maths, PS and NS are also the key subjects. A demo will be required, and the salary will rely on it. At New Mother Teresa School, Vakalapudi, Kakinada, and the KTC Educational & Residential Campus, Bramhanandapuram, Samalkot Mandal. Cont: 98663 96668, 95532 75188 [R-81]

■ ప్రముఖుల ఇళ్ళ వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం 14-20K, వసతి + భోజనం, VJA ✆ 91608 35559, 78158 35561 [B-183]

■ పిల్లల ఇంటివద్దనే ఉండి ఇంటిపని, వంటపని లేదా చిన్నపిల్లలను చూసుకొనుటకు ఆయాలు, బేబి కేర్‌టేకర్స్ అనుభవం గల వారు కావలెను. మంచిజీతం ✆ 78158 35561 / 91608 35559 [B-210]

FACULTY TEACHER

■ అనుభజ్ఞులైన ఉపాధ్యాయులు 6 నుండి 10వ తరగతి వరకు ఇంగ్లీషు బోధించుటకు కావలెను. నర్సరీ నుండి 5వ తరగతి వరకు డిగ్రీ/ బి.ఇడి అర్హత గలవారు కావలెను. PF సదుపాయం కలదు. సంప్రదించండి: 9494656142 బాలమణి కంఠ స్కూలు, ద్వారపూడి. [C-1216557]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra

రీజనల్ సెంటర్లు - రాజమండ్రి - 9010224454, 9951602906, 9010120345, 9705754205
కాకినాడ - 90101 11140, 90109 67896, పిఠాపురం - 99516 02838,
తుని - 90109 67896, జగ్గంపేట - 99482 85589 యానాం - 90101 11140,
అమలాపురం-9705347414, 9705346456, 9848648081, 9010299082,
మండపేట : సెల్ : 99516 02941, 08855-233559,
రామచంద్రపురం : సెల్ : 99516 02936

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం. ఫోన్స్: 0883-2483010